

# 'చావు బావురుమంది'

కాశీభట్ల వేణుగోపాల్

ఒక ప్రసవం...

ఆనందహేల...

అది ఓ అరుణోదయ చిత్రం...

అదే అరుణోదయాన్నే 'అతను' మరణించాడన్న వార్త...

నైమిత్తికాల్ని కొన్ని నెట్టి...

యింకొన్నిటిని జేబున కుక్కి...

మరణ గృహానికి...

***

అక్కడ ఆ మరణ గృహాన, 'అతని' చివరి ఊపిరి లిల్లీలుగా మల్లెలుగా అగరుపొగలుగా అలముకునుందింకా...

"కాఫీ" అరుపులు కొన్ని...

"కప్పులంత పెద్దవెందుకూ" లెక్కలు కట్టేవాడొకడు

షామియానా గుంజలు పాతడానికీ మేకులు కొట్టడానికీ హడావిడి...

"కుర్చీలెన్ని?" కొశ్చెనొకడు

"ఏభై"

"ఏభైయేం సరిపోతాయి... యింకో యిరవై తెప్పించు..." అనామతు హుకుం... యింకోడిది...

కన్నీళ్లు నిండిన కళ్లెక్కడేనా తారసపడతాయేమోనని వెదుకులాట

కన్నీళ్లు రాని కళ్లు నవ్వుతూ పలకరిస్తున్నాయి...

**సింగిల్ పేజీ కథ**

శవాల ఫ్రీజరుడబ్బా వచ్చింది...

"బైటా? లోపలా?" అక్కరలేని అక్కరతో హడావుడి గొంతుకొకటి

"ప్లగ్ పాయింటెక్కడో?" Technical doubt ఒకటి.

"హయినా ఫ్రీజరెందుకండీ ఖర్చు దండగా... ఆయన కొడుకు ఢిల్లీలో flight ఎక్కాట్ట కదా... యెంతలో హయిదరాబాదూ... యెంతలో కర్నూలూ..."

ఇంకో husky గొంతుక- "నోరు ముయ్యి body అప్పుడే గబ్బు కొట్టడం మొదలైంది... decompose పూర్తిగా అయితే అంతే..."

శవాన్ని ఫ్రీజర్లో పెట్టడానికి పైకెత్తారు...

దుప్పట్లో కప్పడిన 'అతని' చేయి వేలాడింది...

"అరెరె నాలుగు వేళ్లకీ నాలుగుంగరాలున్నె తీ    తీయండి"

రెండు మూడు చేతులు లాగడానికి యత్నించి    నై...

శవం ఉబ్బుతోంది... ంది.

లోపలి గది కిటికీలోంచే ఆతురతో అడ్డకడ్డీలకు హత్తుకున్న ఆడముఖాలు కొన్ని- "యిక్కడ పక్కన్నే తాళాలు రిపేరీ వాడున్నాడు వాణ్ణి పిలవండి" ఓ జ్ఞాని గొంతుక...

పట్టకారాకు లొంగిన బంగారం

తెగి ఊడిన ఉంగరాలు

బోసిపోయి తెల్లటి ఉంగరపుటచ్చులతో మంచు చేయి...

గాజుపెట్టెలో ఒదిగిన ప్రపంచాన్ని జయించాననుకున్నవాడు...

"అయ్యవారిచ్చిన లిస్టులో సరుకులన్నీ వచ్చినయా?" మేనేజ్‌మెంట్ గొంతుకొకటి.

లిస్టు సరుకుల్తో పాటొచ్చిన అయ్యవారు

బొంగులూ... చాప్పా... అడ్డకట్టెలూ... ఫరీ

సైనుగుడ్డలో నిన్నటి 'అతని' ఉరీ...

'పట్టండి... పట్టండి'

'నువ్వటుగా రా'

'భారీ మనిషండీ బాబూ'

'Dead weight అంటే యిదే మరి' చావు హాస్యం...

'బొరుగులూ చిల్లరపైసలూ నువ్వా నువ్వా'

నిన్నటి 'అతను' అనంతం దిశగా కదిలాడు.

'నారాయణ నారాయణ'

***

చిల్లర పైసలకోసం ఎప్పట్నించో అక్కడ కాచుక్కూచున్న దేశ దారిద్ర్యం... శ్మశానం వరకూ 'అతని' వెంటే ఆనందంగా...

శవం కదలికకు ఒక్కసారి లేచిన గువ్వల గుంపులాగా...

ఒక చిన్నది ఆరేళ్ల పసిది చిల్లరపైసల దేవులాట దొమ్మీలో పోట్లాడలేక బిక్కు బిక్కుమంటూనే భీకరంగా కేకలు వేస్తూ వేళ్లతో మట్టిని పెళ్లగించి దున్నుతోంది... ఎప్పుడో ఎండిపోయిన్నేలే యిది 'పిచ్చిముండా!'

చెల్లని అయిదు పది పైసాలు మాత్రం పోగవుతున్నాయి ఆ చిట్టి మట్టిచేతుల్లో...

వైశ్వానరుడికి నిన్నటి నరుడు ఆహుతైయ్యాడు...

***

గోరీల మీదా, షెడ్డు కట్టల మీదా వెలిగిన సిగరెట్లు

వాళ్ల దరికి చేరిన చిల్లర దొరకని చిట్టిది...

'అయ్యా!' మట్టిగోళ్ల మాసిన చిట్టి చెయ్యి మట్టి  పువ్వల్లే విచ్చుకుని...

"ఛో లంజాముండా యిక్కడ కూడా..."

ఓ ఖద్దరు జేబులోంచీ బైటికి లాగబడ్డ సిగరెట్ ప్యాకెట్టు... దాని అంచుల్లో నక్కిన ఓ రూపాయిబిళ్లా ఒకేసారి...

చెయ్యి సిగరెట్ వెలికితీస్తే జారిదొర్లిన రూపాయి... తిన్నగా మట్టి పాపాయి కాళ్ల దగ్గిరాగింది...

అది దాన్నందుకుని ఆనందంగా అదే పరుగు...

పరిగెడుతూ పరిగెడుతూ చిన్నకాలువ పక్కన పూచిన ఉమ్మెత్తను చూచి ఆయాసంతో ఆగి... ఉమ్మెత్తను కోసి... ఆ మట్టిపిల్ల...

ఓ చేత పూవూ...

యింకో చిన్ని పిడికిట్లో బిగించిన చిల్లరతో కేరింత కొడుతూ కాస్త దూరం మళ్లీ పరుగు...

మాసిన దాని చేత పదఘట్టనకు రేగుతోంది శ్మశాన ధూళి

అది ఆ చిన్నదాని ఆనందకేళి...

ఆగి వెనుతిరిగి చితిని చూచిందా చిన్నది మనసారా నవ్వి...

అది చూచి

చావు బావురుమంది.